# స్టాఫ్‌రూమ్‌లో

**నే**ను స్టాఫ్‌రూంలోకి ప్రవేశించేసరికి అక్కడి పరిస్థితి చాలా భీభత్సంగా ఉంది. తెలుగు లెక్చరర్ అవధాని గారు వినరాని భాషలో అరుస్తున్నారు. ఇంగ్లీషు లెక్చరర్ విశ్వనాధరెడ్డి కుర్చీ పట్టుకుని నిలబడి తూలులూ ఇంగ్లీషు, తెలుగు భాషలను కలగాపులగం చేసి ఎవరినో తిడుతున్నాడు. రెడ్డి, అవధాని మంచి మిత్రులు . ఇద్దరూ కలసి తిడుతున్నా రంటే వీళ్ల కామన్ టార్గెట్ ఎవరై ఉంటారా అని చూశాను కృష్ణచైతన్య. కిటికీ దగ్గర నిలబడి దూరంగా కనిపిస్తున్న సముద్రాన్ని చూస్తూ– బహుశా అలల సంక్షోభంలో తన సంక్షోభాన్ని దర్శిస్తూవుండివుంటాడు. పరిస్థితి కొంతవరకు అర్థమయింది.

నన్ను చూస్తూనే గొంతుమరింత పెంచాడు అవధాని " చూడవయ్యా మూర్తీ! మీ చైతన్య గారి చైతన్యం! మే మిద్దరం స్టాఫ్ రూంకి న్యూసెన్స్ కింద తయారయ్యా మట. నేను నోటికి తాళం వేయకుండా అడ్డమైన అవాకులు, చవాకులు వాగుతున్నానట. బాగుంది కదూ వ్యవహారం? మా మీద వ్యాఖ్యానాలు చేసే హక్కు, ధైర్యం ఇతగాడికెలా వచ్చాయుట? నాగ్గాని నిజంగా వెర్రెత్తిందంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు తరిస్తారు నా తిట్లతో. అక్కడితోనీ ఆగకపోతే ఈ వ్యవహారం చేతలదాకా వస్తుంది. ఈవిషయం మీ మిత్రుడికి కొంచెం బోధపడేట్లు చెప్పండి'' అన్నాడు.

గబగబా ముందుకు పరుగెత్తి అవధాని చేతులు పట్టుకుని " మాస్టారూ!... ప్లీజ్, అనవసరంగా గొడవలు పెంచకండి'' అన్నాను. సర్దుబాటు చేసే ధోరణిలో. అయితే ఆయన మరింత [illegible], " కాకపోతే ఏమిటండీ ఇతగాడి వేషాలు? కాలేజీ కొచ్చిన దగ్గర నుంచి అదే పనిగా సిగరెట్లు కాల్చి కాల్చి స్టాఫ్ రూమంతా పొగతో నింపేసి నానా దరిద్రం చేస్తున్నాడే, ఈ పొగ పీల్చి పీల్చి మేం కూడా అతని పెళ్లాం లాగే కేన్సరొచ్చి చావాలనా అతని ఉద్దేశం? అయినా మేం అతణ్ణి పల్లెత్తు మాటన్నామా ఏనాడైనా? మళ్లీఇతగాడు తత్వశాస్త్రాన్ని, మనస్తత్వ శాస్త్రాన్ని కూడా ఔపోసన పట్టిన మేధావిట కదా! పాపం, అతగాడికి బలహీనతలన్నవి లేవు. అవన్నీ మా ఇద్దరికే పరిమితం కాబట్టి మా మీద ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానాలు చేస్తూంటాడు ఇతగాడు ..." అవధాని గొంతు నాలుగ్గదులు దాటి వినిపిస్తోంది. నే నాయన్ని మరింత దీనంగా బతిమాలడం మొదలు పెట్టాను. "అవధాని గారూ!" అన్నాను ప్రార్థనాపూర్వంగా. "అది కాదయ్యా మూర్తీ! ఆర్నెల్ల కిందటి వరకూ మన రెడ్డి గారు సారా సంగతటుంచి, కనీసం సిగరెట్టు పీకైనా వెలిగించేవాడా?

బంగారం బొమ్మగాని మమూలు పిల్లటయ్యా అతని కూతురు? అలాంటి పిల్లను లారీ తొక్కేస్తే రక్తం మడుగులో ఎర్ర గులాబీలా ఆ అమ్మాయి చచ్చి పడుంటే, ఏడవని స్టాఫ్ మెంబరున్నాడటయ్యా? అంతెందుకు, మమ్మల్నివాళ విమర్శించే స్థాయి కెదిగిన ఈ చైతన్య గారేంచేశారావేళ? – చనిపోయిన బిడ్డను ఎత్తి పట్టుకుని భోరుమని గుండెలు పగిలేలా ఏడవలేదూ? ఆణిముత్యం లాంటి కూతురు పోతే, ఆ పిల్లను మరిచిపోవడం సాధ్యం కాక, దుఃఖాన్ని ఎలా అదుపులో పెట్టుకోవాలో తెలియక – తాగుడు మొదలెట్టారు రెడ్డిగారు. ఆయన ఎంత మంచివాడో, ఎంత మంచి మాస్టారో ఇంతలోనే మరిచిపోయి ఎద్దేవా చేయటమా? సానుభూతి లేకపోతె లేదు. కనీసం సహనమైనా ఉండాలి కదా రెడ్డి గారి విషయంలో? అతణ్ణి తప్పుపడతాడా? ఇతగాడుమనిషేనా?"

"అవధాని గారు! ప్లీజ్ ! ప్లీజ్, నేను మిమ్మల్ని రిక్వెస్టు చేస్తున్నాను దయచేసి ఊరుకోండి. స్టూడెంట్స్‌కి మన కేకలు వినిపిస్తున్నాయి. క్లాసుల్లో తలెత్తుకోలేం. ప్లీజ్! శాంతించండి."

నా మాటలు విని రెచ్చిపోయాడు రెడ్డి. తాగుడు ప్రభావం, కుర్చీని గట్టిగా పట్టుకున్నా ఊగిపోతున్నాడు మనిషి. మాటలు ముద్దగా వస్తున్నాయి. "మిస్టర్ మూర్తీ! నీ స్నేహితుడిని ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రవర్తించమని చెప్పండి. తెలెసిందా? అసలే దెబ్బతిన్న మనిషిని. ఇంక ఈయన మాటలు సహించేదిలేదు, తెలిసిందా?" రెడ్డిని సముదాయించే ధోరణిలో అతని చెయ్యి పట్టుకుని,"అవధానిగారు! రెడ్డి గార్ని కాసేపు అలా గాలిలోకితీసుకెళ్లండి, ప్లీజ్! నేనెందుకు చెప్పుతున్నానో అర్థం చేసుకోండి!" అని బ్రతిమాలాను,

రెడ్డి చెయ్యిపట్టుకొని బయటికులాక్కెళ్ళాడు అవధాని " అదికాదవధానీ, ఆబాస్టర్డ్...." వరండాలోంచి రెడ్డి తిట్లుమెల్లిమెల్లిగా దూరమవుతున్నాయి. కిటకిదగ్గరకువెళ్లాను, కృష్ణచైతన్య ముఖం ఎర్రగా కందిపోయివుంది. కళ్లల్లో కనిపించీ కనిపించని నీటిపొర, "ఎందుకురా కృష్ణా, వాళ్లని కవ్విస్తావు? వాళ్ల పరిస్థితులు తెనిసికూడ ఎందుకు అలా ప్రవర్తిస్తున్నావో నాకర్థం కాకుండా వుంది."

"మూర్తీ! ఇక ఈ స్టాఫ్ రూమ్‌లో కూర్చోవడం నావల్లకాదురా! కాదంటే రేపటినుంచి బోటని లాబ్ దగ్గరున్న గార్డెన్‌లో కూర్చుంటాను గాని, ఇక్కడ మాత్రం కూర్చుని వీళ్లగోల వినలేను, నాకు ప్రశాంతత కావాలి"

"కృష్ణా! ప్లీజ్, డోంట్ బిసిల్లీ! రెడ్డి ఇలా ఎందుకు తాగు బోతుగా మారాడో నీకుతెలుసు. రెడ్డి మంచి మనిషి అని, మంచి లెక్చరర్ అని గతంలో ఎన్నో సార్లు మనమనుకున్న విషయం నువ్వు మరచిపోయావా? ఇవాళ అతడు తాగుడికి బానిసయ్యాడంటే అందుకు కారణం నీకు తెలియంది కాదు, ఇక అవధాని సంగతి సరేసరి. గుండెలమీద కుంపటిలా పెళ్లి కాని కూతుళ్లు, రౌడీ కింద తైయారైన కొడుకు, పూర్వులు మిగిల్చిన ఆస్తులు ఖర్చుయిపోయాయి కాని, దుబార ఖర్చులు మాత్రం పోలేదు. వచ్చే జీతం కనీసం తిండికి కూడా సిరిపోదతగాడికి. ఇంటికి వెళ్లడం అంటే నరకానికి వెళ్లినట్టుందని మనఅందరి ముందు అతను వాగుతుండటం మనకు తెలియని

సంగతా?

"తన కుటుంబ సమస్యలనుంచి తప్పించుకోవడానికి, తన ఇబ్బందులను తాత్కాలికంగా మర్చిపోవడానికి అతను చేసే ప్రయత్నం ఈ కేకలు, నవ్వులు, అవహేళనలును . సైకాలజీ చదివినవాడివి-వాళ్ల పరిస్థితిని అవగాహన చేసుకుని సానుభూతిని చూపించాల్సిందిపోయి, నువ్వు బొత్తిగా ఇలా న్యురోటిక్‌లాగా ప్రవర్తించడం ఏం సబబుగాలేదురా. కృష్ణా !"

" అది కాదురా మూర్తీ, వీళ్లగోల భరించలేను. నేనెక్కడికైనా వెళ్లిపోవాలి. ఇవన్నీ తప్పించుకుని పోవాలి, లేకపోతే ఏనూతిలోనో, గోతిలోనో పడిచస్తాను, పీడవదులుతుంది"

"ఛ...ఛ ఏమిట్రా కృష్ణా నువేనా మాట్లాడుతున్నది? ఆత్మహత్య మన సమస్యలకు పరిష్కారం కాదని నువ్వే కదా ఫిలాసఫీ క్లాసులో చెపు తున్నది! ఇంతకీ, సమస్యలనుండి తప్పించుకుని పారిపోవడం అన్నది సాధ్యపడే సంగతేనా? గొయ్యిలో పడకుండా తప్పించుకుందామని వెనక్కువెళితే మనకు కనబడకుండా వున్న నుయ్యిలో పడమని గ్యారంటీ ఏముంది?"

"ఈ ప్రపంచంలోకి ప్రవేశించడంతోనే అర్థం పర్థంలేని పరిస్థితుల్లో చిక్కుకుపోయానని నువే కదా చెపుతుండేవాడివి? కొద్ది రోజుల కిందటి వరకూ గంతులు వేస్తూ, చిగుళ్ల మీద నడుస్తూ వుండేవాడివి, నువ్వెక్కడుంటే అక్కడ నవ్వుల జల్లులా వుండేది. ఈవాళ ఎవరు మాట్లాడినా భరించ లేక పోతున్నావు. ఎవరితో మాట్లాడటమన్నా చికాకు పడిపోతున్నావు. నళిని అనారోగ్యం నీలో ఎంత మార్పు...."

"ఆగు! ఆవిషయం మరి ప్రస్తావించకు. మనస్సు ముక్కలయిపోయే కదా ఇలా న్యూరోటిక్‌గా తయారయ్యాను. చీకట్లో పొంచి ఉన్న పులిలాగా, అనర్థాలు గభీమని విరుచుకు పడుతుంటే అర్థం లేని ఈ బతుకు ఎందుకు బతకడం?"

"మళ్లీ చెపుతున్నాను చచ్చిపోవడం మన సమస్యలకు పరిష్కారం కాదు. బతుక్కి అర్థం లేదని గ్రహించాం కదా! అంచేత దీన్ని కేవలం ఒక గేమ్‌లాగా తీసుకుని ఎదుర్కోడానికి ఎందుకు ప్రయత్నించకూడదు? బహుశా అవధాని, రెడ్డి చేస్తున్నదదేనేమో!"

"ఓడిపోతామని ముందే తెలిసినా గేమ్ ఆడమంటారా? సరే, చూద్దాం! ఛీ ! ఛీ !మూడంతా పాడు చేశాడీ అవధానిగాడు. క్లాసులోకి వెళ్లి పాఠ మెలా చెప్పాలో తెలియటం లేదు, దానికి తోడు ఇవాళ సార్త్ర్, కమూల్ని డిస్కస్ చేస్తానన్నాను."

"కృష్ణా! మనసుని కొంచెం నిగ్రహించుకో, మరేం పరవలేదు. క్లాసుకు వెళ్లిరా! ముందు కాస్తముఖం కడుక్కో. ప్రపంచంలోని దుఃఖ మంతటికీ నువ్వే ప్రతినిధిలా కనిపిస్తున్నావు. "

కృష్ణ చైతన్య క్లాసుకు వెళ్లిపోయాడు ఈ విశాల ప్రపంచంలో వ్యక్తి జీవితంలోకీ ఈ ఊహించని పరిస్థితులూ, ప్రమాదాలు ఎందుకు ప్రవేశించి బ్రతుకులను అస్తవ్యస్తం చేస్తాయో అర్థం కాక తల పట్టు క్కూర్చున్నాను. ఇంతలో ప్రిన్సిపాల్‌గారు రమ్మంటున్నారని కబురు. కృష్ణ

చైతన్య క్లాసు పక్క నుంచి వెళ్తున్నాను.

" ఊహించని అస్తవ్యస్త పరిస్థితులు ఎక్కడ చూసినా మనకు ఎదరవుతూనే ఉంటాయి. అయితే మృత్యువుతో ఇవన్నీ సమాప్త మవుతాయి. మృత్యువుతో యివన్నీ ముగుస్తాయని తెలిసి కూడా మనం పరిస్థితులతో పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటాం 'మిత్ ఆఫ్ సిసిఫస్'లో కమూ (Camus) ఇదే విషయాన్ని మనకు తెలియచేస్తాడు" అని పాఠం చెపుతున్నాడు కృష్ణ .

గొంతులో ఎంతో శ్రావ్యత ఉంది. కొద్దిగా శ్రద్ధగా వింటే చాలు ,అతగాడి పాఠం మనస్సుకి హత్తుకుంటుంది. కాని మెల్లిగా చిటికెలు వేసి, ఆవులింతలు ఆపుకుంటున్న కుర్రాడొకడు కనిపించాడు. అవును మరి, ఏ గ్రూపులోనూ సీటు రాకపోతే ఆఖరి మార్గంగా ఫిలోసఫీ కి అప్లయ్ చేసుంటాడు. ఇష్టం లేకపోయినా, బలవంతంగా ఈ పాఠలను వినవలసిన గతి పట్టింది పరీక్ష రాయాలి కనుక! ఇంతకంటే అబ్సర్డ్ సిట్యుయేషన్ ఏముంటుంది? 'మిత్ ఆఫ్ సిసిఫస్' కి సుదీర్ఘమైన వివరణ వినేకంటే, తన పరిస్థితిని ఆకళింపు చేసుకుంటే సరిపోతుంది కదా ఆ కుర్రాడికి!

ప్రిన్సిపాల్ గారు నన్ను ఆప్తుడిగా భావిస్తుంటారు. ఎంతో తెలివిగా చదువుకొని, బాగా ముందు కొస్తాడని అందరూ అనుకుంటూండేవారు ప్రిన్సిపాల్ గారి కొడుకు గురించి. స్కూటర్ ఏక్సిడెంట్ అయి అవిటి వాడయిపోయాడు. అప్పటి నుంచి బాగా మానసికంగా క్రుంగిపోయారు ప్రిన్సిపాల్ గారు. అయినా తన స్వంత బాధలు పదవీ నిర్వహణకు అడ్డుగా నిలవకూడదని నమ్మే మనిషి కనుక పరిపాలనను సమర్ధవంతంగా నిర్వహించుకొస్తున్నాడు.

నన్ను చూసి, "రావయ్యా, మూర్తీ!" అని పలకరించి, లోపలి గదిలోకి దారి తీశారు. కూర్చున్నాక ఒక కవరు తీసి అందించారు. డైరక్టర్ ఆఫీస్ నుంచి నచ్చిన కవరు. ఎందుకో కాస్త చెయ్యి వణికింది కవరులోని ఉత్తరం తీస్తుంటే. ప్రిన్సిపాల్ గారిని పాడేరు బదిలీ చేసినట్లు ఆర్డరు. " సార్! ఏమిటిది?" అన్నాను ఆందోళనగా.

నా వైపు దీనంగా చూసి, కుర్చీలో చతికిల బడ్డాడాయన. ఆయన కళ్లల్లో తడి. అవును మరి, అతని పరిస్థితి ఎంతో జాలి కలిగించేటట్లుగా ఉంది. కూతురు పురిటికి వచ్చింది. ఆ అమ్మాయికి కాన్పు కష్టం కావచ్చునని ముందే డాక్టరు హెచ్చరించింది. ప్రిన్సిపాల్ గారి భార్య ఎంతో మంచి మనిషికాని కొడుక్కి ఏక్సిడెంటయిన దగ్గర నుంచి ఆవిడకు మనోవ్యాధి పట్టుకుంది. ప్రిన్సిపాల్‌గారు ఆమె కళ్ల ముందుడి ధైర్యం చెపుతుంటేనే ఆవిడ మనిషి లేకపోతే, మానసికంగా అధైర్యపడిపోయి మంచాన పడుతుంది ఇక కొడుకు సంగతి సరే సరినిత్యం దిగులుతో, మంచం మీద. వైజాగ్ నుంచి ప్రిన్సిపాల్ గారు బొత్తిగా కదల్లేని పరిస్థితి. ఇలాంటి సమయంలో పాడేరు అడివిలోకి బదిలీ.

"అక్కడ కాలేజీ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయని దాన్ని ఒకదారికి తేవడానికి సమర్ధుడయిన ప్రిన్సిపాల్ కావాలని ప్రజా ప్రతినిధులు కోరేరట. దాని మీదట కొన్ని ప్రత్యేక అధికారాలు

కల్పిస్తూ మరీ మా ప్రిన్సిపాల్ గారిని అక్కడకి బదిలీ చెశారు."

డైరక్టరు గారు ఒక ఉత్తరం కూడా పంపించారు ప్రిన్సిపాల్ గారి ఆర్డరుతోపాటు. "మీకు అప్పగించిన ఈ ప్రత్యేక బాధ్యతను సమర్ధవంతముగా మీరు నిర్వహిస్తారని విశ్వాసం నాకుండబట్టి మిమ్మల్ని అక్కడకి పంపిస్తున్నాం. మీ తరువాతి ప్రమోషన్‌కి ఇది మెట్టని నేను వెరే గా చెప్పనక్కర్లేదు" అని రాసుంది దాన్లో.

ప్రిన్సిపాల్ గారికి 'ఎర' కూడా వేశారు. కానయితే, అతనికున్న పరిస్థితుల్లో, ప్రస్తుతం వైజాగ్ వదిలి వెళ్లలేరు. అలా అని వెళ్లకుండా ఉండలేరు. డ్యూటీ అంటే ఆయనకున్న కమిట్‌మెంట్ అలాంటిది. ఆయన పరిస్థితి పూర్తిగా తెలిసిన వాడిని కనుక "సారీ, సార్" అనేసి, మెల్లగా బయటకు వచ్చేసాను.

మళ్లీ కృష్ణ చైతన్య క్లాసు పక్కనుండి వెళ్లవలసి వచ్చింది. క్లాసులోంచి బయటకు వచ్చేసిన కొందరు విద్యార్థులు ముందుగా నడుస్తూ మాట్లాడుకుంటున్నారు.

ఓ కుర్రాడు కాస్త గట్టిగానే అంటున్నాడు,

"ఇక నేనీ బోర్‌ని భరించలేనురా, సుబ్బా! ఖాళీగా కూర్చుని ఏం చేస్తాంలే అని అప్లయ్ చేస్తే, ఫిలాసఫీలో సీటిచ్చి నిలువునా పాతేశాడు ప్రిన్సిపాల్. ఫిలాసఫీ గురువు చైతన్యను గమనిస్తున్నావా? మనిషి బాగుంటాడు, పాఠం బాగా చెప్తాడు. అన్నీ నిజమే గానీ, ప్రతి రోజూ "జీవితం, అస్తిత్వం, అసంగతం, అనిశ్చయత ఇవే అతని టాపిక్స్! వీటి గురించే ఆయన లెక్చర్స్."

"అతని భార్యకు కేన్సర్ రావడం కాదు గాని, అది మన పాలిట శాపమై కూర్చుంది. అతని జీవితంలోని అసంగతాన్ని పాఠాలుగా మార్చి నిత్యం మనసు చిత్రవధ చేస్తున్నాడు. ప్రతిరోజూ ఇంచుమించు అదే టాపిక్ వినీ వినీ విసుగెత్తిపోతోంది ప్రాణానికి.. రేపటి నుంచి 'బోర్‌డమ్' అన్న టాపిక్ మీద లెక్చరిస్తాడట. ఇహ నావల్ల కాదు, ఈ క్లాసులో కూర్చోవడం . ఎవడి జేబైనా కొట్టేసేనా సరే, రోజూ మాట్నీకి వెళ్లిపోతాను."

నన్ను వాళ్లు చూడలేదు. చూస్తే, ఇంత స్వేచ్ఛగా మాట్లాడుకోరు. వాళ్ల మాటలు విని ఆలోచనలో పడ్డాను, అవునూ, మనం ఎంది కిలా ప్రవర్తిస్తున్నాం? ముద్దులు మూటగట్టే కూతురు చనిపోతే, ఆ బిడ్డను మరిచిపోవడానికి తాగుడు మొదలు పెట్టాడు రెడ్డి. తన గృహ కృత్యాలు గుర్తుకు రాకుండా చేసుకోవడానికి వెకిలి నవ్వులు, వెర్రి కేకలు వీటితో ఓ ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నాడు అవధాని. తన ప్రాణానికి ప్రాణంలా భావించిన భార్యకు కేన్సర్ అని డాక్టర్లుచెప్పిన దగ్గర నుంచి ఉత్సాహానికి మరో పేరులా ఉండే కృష్ణచైతన్య సాటి మనుషుల సాన్నిహిత్యాన్ని భరించలేక మానసిక రోగిలా తయారయ్యాడు. పొంచి ఉన్న దొంగలా దెబ్బతీసింది జీవితం వీళ్లందరి మీదా. ప్రిన్సిపాల్ గారి సామర్థ్యాన్ని గుర్తించి ఆయన కిచ్చిన బదిలీ ఆయన పాలిట శాపమై కూర్చుంది. ఇక విద్యార్థుల సంగతి చూస్తుంటే, వాళ్లను తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన పాఠాలు తలనొప్పి కారకాలుగా తయారవుతున్నాయి. ఏమిటిదంతా? ఆలోచిస్తూ, స్టాఫ్ రూం

కిటికీ దగ్గర నిలబడి దూరంగా విరుచుకు పడుతున్న అలలను చూస్తున్నాను. కడలికి కూడా బోలెడు కష్టాలున్నాయేమో! లేకపోతే ఎందుకలా అంతు లేకుండా విరుచుకు పడుతూంటుంది? లాంగ్ బెల్ అయింది. ఆలోచనల గాలిపటం పుటుక్కున తెగిపోయింది. గేట్లో నుంచి బయటకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య ఎంత తక్కువగా ఉందో!

ఇంటి దగ్గర పని లేక కాలేజీకి రావడం, పాఠాల బోర్ పడలేక వెంటనే మళ్లీ బయటి కెళ్లిపోవడం ఇవన్నీ గమ్యరాహిత్యానికి సంకేతాల్లా అనిపిస్తున్నాయి. రోజూ కాల్చినట్లే సిగరెట్లు కాలుస్తూ, బడ్డీ కొట్లలో డొక్కుటీలు తాగుతూ, వెకిలి చేష్టలు చేస్తూ, చెత్త సినిమాలు చూస్తూ గడుపుకొస్తున్నారు జీవితాన్ని చాలామంది విద్యార్థులు, ఆ లైఫ్‌లో బోర్‌డమ్ కనిపించడం లేదేవిటి చెప్మా వీళ్లకి?

హడావుడిగా వెళ్లిపోతున్న విజయకుమార్‌ని "క్లబ్బుకేనా?" అనడిగాను.

"మరింకెక్కడికి, గురూ!" అని సమాధానం విసిరేసి, తవిటన్న రిక్షాలోకి దూకేశాడు. రోజూ క్లబ్, అదే పేకాట, అక్కడికి చేరే చవకబారు మనుషులు, స్టీరియో టైపు సంభాషణలు బోర్‌డమ్‌ను తరమడానికి చేసే ప్రయత్నంలో దాన్ని మరింతగా ఆహ్వానించడంలేదూ?

కృష్ణ చైతన్య క్లాసు నుంచి వచ్చేశాడు. ఇద్దరం కలిసి గేటు వైపు నడుస్తున్నాం. మాక్కాస్త ముందుగా రెడ్డి అవధాని పెద్దగా మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

నడుస్తున్నవాడు టక్కున ఆగిపోయాడు చైతన్య "ఒరే, మూర్తీ! ఈ జీవితంలో అసంబద్ధత, చీకాకు,ఒంటరితనం – వీటిని మనం తప్పించుకోలేంరా! వీటిని ఎదిరించటానికి ఎవడి పోరాటాన్ని వాడే చెయ్యాలి. ఇవన్నీ దెయ్యాల్లా మన చుట్టూ తిరుగుతున్నా, వాటి నసలు చూడనట్టు మన మంతా నటిస్తూంటాం. అదే గొప్ప వింత!" అనేసి, వెనక్కు తిరిగి గబగబా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

వాడి ప్రవర్తన అర్థంకాక ఒక్కక్షణం అలా ఉండిపోయాను. ఇంతలో గుర్తు వచ్చింది నళినికి ఆ రోజు మళ్లీ బయోప్సీ చేశారు. రిజల్ట్ తెలుసుకోడానికి డాక్టర్ దగ్గరకు పరుగెత్తుతున్నాడని తెలిసి నిట్టూర్చాను.